

పంట అవశేషాల నిర్వహణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

స్థానిక ఎన్నికలకు పటిష్ట భద్రత

- జిల్లాలో 104 రూట్లలో 57 క్లస్టర్లు
- 309 మంది గ్రామ పోలీసు అధికారులకు బాధ్యతలు
- సీపీ గౌస్‌ఆలం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని సీపీ గౌస్‌ఆలం అన్నారు. శుక్రవారం జిల్లా లోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అధికారులు చేయవలసిన, చేయకూడని పనులపై చిన్న హ్యాండ్‌బుక్‌లెట్‌ను తయారు చేసి అందరికీ అందజేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ రూరల్, హుజురాబాద్ డివిజన్లలోని 15 పోలీసు స్టేషన్ల పరిధిని పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా విభజించామన్నారు. 104 రూట్లు, 57 క్లస్టర్లుగా విభజించి, క్లస్టర్ ఇన్‌చార్జిలుగా 83 మంది అధికారులుగా బాధ్యతలు అప్పగించామని తెలిపారు. గ్రామ పోలీసు అధికారులుగా క్షేత్రస్థాయిలో అన్ని గ్రామాలు కవర్ అయ్యేలా మొత్తం 309 మందిని నియమించామని చెప్పారు. ఎన్నికల ప్రారంభమయ్యేవరకు క్షేత్రస్థాయిలో 508 మంది పోలీసు అధికారులు నిరంతరంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పర్యవేక్షణ బాధ్యతలను ఉన్నతాధికారులకు అప్పగించామన్నారు. ఇద్దరు ఏసీపీ స్థాయి అధికారులు పూర్తిస్థాయి పర్యవేక్షణ చేస్తారని, నలుగురు సీఐలు, 25 మంది ఎస్ఐలు క్షేత్రస్థాయి పర్యవేక్షించనున్నట్లు సీపీ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండేందుకు, కమిషనరేట్ పరిధిలోని రౌడీ షీటర్లను బైండోవర్ చేశామని సీపీ తెలిపారు. వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు అధికారులకు పూర్తిగా సహకరించాలని సీపీ గౌస్ ఆలం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వాసాల సతీష్ పాల్గొన్నారు.

రసవత్తరంగా 'పంచాయతీ' పోరు



- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- ఉప సర్పంచ్ పదవులపై నేతల ఫోకస్
- ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో భారీగా డిమాండ్
- మహిళా రిజర్వుడ్ స్థానాల్లో తీవ్ర పోటీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'పంచాయతీ' ఎన్నికలతో గ్రామాల్లో రసవత్తర పోరు నెలకొంది. మూడో విడతలో ఎన్నికలు జరిగే పంచాయతీల్లో సర్పంచు, వార్డు పదవుల కోసం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. నామినేషన్ల చివరిరోజు కావడంతో సర్పంచ్, వార్డు సభ్యుల పదవుల కోసం అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు బారులు తీరారు. సాయంత్రం 5 గంటల తర్వాత క్లస్టర్లలో ఉన్న వారందరికి టోకెన్లు జారీ చేసి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. మొదటి, రెండో విడతలో ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ప్రచారంతోపాటు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

● రిజర్వుడ్ స్థానాలపై దృష్టి

సర్పంచ్ స్థానాలు ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వుడ్ అయిన గ్రామాల్లో ఉపసర్పంచు పదవులపైనా నేతలంతా ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. గతంలో పోటీ చేసి గెలుపొందిన మాజీ సర్పంచులు, ఓటమి పాలైన అభ్యర్థులు తిరిగి సర్పంచ్‌లుగా పోటీ చేసేందుకు రెండేళ్లపాటు నిరీక్షించారు. కొంత మందికి రిజర్వేషన్లు అనుకూలించగా మరికొంత మందికి పోటీచేసే అవకాశం లేకుండా పోయింది. అలాంటి నాయకులు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో, వాటికి కూడా రిజర్వేషన్లు అనుకూలిస్తాయో లేదో తెలియక కొందరు వార్డుసభ్యులుగా పోటీ చేసి ఉప సర్పంచు పదవులను దక్కించుకునేందుకు నామినేషన్లు వేసి ఎన్నికల బరిలో నిలిచారు. మరికొంత మంది వారి అనుచరులు, మద్దతుదారులను పోటీలో నిలిపి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల వరకు వేచి చూసే ధోరణితో పంచాయతీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. ఇంకొందరు రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్న వారి కుటుంబసభ్యులు, బంధుమిత్రులను పోటీలో నిలిపి సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులతో గ్రామాల్లో రాజకీయ పట్టు నిలుపుకునేందుకు పావులు కదుపుతున్నారు. చాలా గ్రామాల్లో రిజర్వేషన్లతో సర్పంచ్‌గా పోటీకి అవకాశం లేనివారంతా ఉప సర్పంచ్ పదవులపై కన్నేశాయి.

● జిల్లాలో 316 పంచాయతీల్లో ఎన్నికలు

జిల్లాలో 318 గ్రామపంచాయతీలు ఉండగా రెండు గ్రామాలపై కోర్టుకేసులు ఉండడంతో ప్రస్తుతం 316 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో ఎస్టీలకు ఒకటి, ఎస్సీలకు 71, బీసీలకు 84, ఇతరులకు 162 స్థానాలు రిజర్వు అయ్యాయి. 146 పంచాయతీల సర్పంచ్ పదవులు మహిళలకు కేటాయించారు. ఎస్టీకి ఒక సర్పంచ్ స్థానం రిజర్వు కాగా అక్కడ ఉపసర్పంచ్ పదవిపై జనరల్, బీసీ అభ్యర్థులు పోటీకి సిద్ధమవు తున్నారు. బీసీలకు కేటాయించిన 84 సర్పంచు స్థా నాల్లో 39 మహిళలకు రిజర్వ్ అయ్యాయి. అక్కడ కూడా ఉప సర్పంచ్ పదవి కీలకంగా మారింది. మొ దటి విడతలో ఈనెల 11న సర్పంచ్, వార్డులకు ఎన్నికలను నిర్వహించి అదే రోజు ఓట్లు లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు. అనంతరం ఉప సర్పంచ్ ఎన్నికల నిర్వహిస్తారు. రెండో విడత 14న, మూడో విడత ఎన్నికలు 17న నిర్వహిస్తారు. అదే రోజు ఉపసర్పంచ్‌లను ఎన్నుకుంటారు.

● ఊపందుకున్న ప్రచారాలు..

మొదటి, రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో సర్పంచ్, వార్డు సభ్యుల పదవికి పోటీచేస్తున్న అభ్యర్థులంతా ప్రచారాలపై దృష్టి సారిస్తున్నారు. మొదటి విడత ఎన్నికలు జరిగే కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల్లోని గ్రామాల్లో సర్పంచు, వార్డుసభ్యులకు గుర్తులు కేటాయించారు. అభ్యర్థులు కరపత్రాలు, బ్యాలెట్ నమూనాలు, వారికి కేటాయించిన గుర్తులను చేతబట్టుకొని ఇంటింటికి వెళ్లి

(మిగతా 8వ పేజీలో)

జీవ వైవిధ్య పరిరక్షణలో భూమిది కీలక పాత్ర

భగత్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్య పరిరక్షణలో నేల కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంటలో కరీంనగర్ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పంట అవశేషాల నిర్వహణ పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక రసాయనాల వాడకం పంట వ్యర్థాలను తగులబెట్టడం వంటి అంశాలను రైతులు పరిగణనలోకి తీసుకుని నేల, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. శాస్త్రవేత్త మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ నేలల దినోత్సవాన్ని ఆరోగ్యకరమైన నేలలు పునాదులు అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ, శాస్త్రవేత్త డాక్టర్ ఇ రజనీకాంత్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, సహకార భారతి రాష్ట్ర కో-ఆర్డినేటర్ న్యాలమడుగు శంకరయ్య, మండల వ్యవసాయాధికారి సంతోష్, ఎఈఓ రాము, రమేష్‌రెడ్డి, బాలాజీ, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చివరి రోజు భారీగా నామినేషన్లు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. చివరిరోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 82, 196 వార్డు స్థానాలకు గాను 322 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని సర్పంచ్ స్థానాలకు మొత్తం 149, వార్డు స్థానాలకు 552 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

● వీణవంక: మండలం లోని 26 గ్రామ పంచా యతీల్లో శుక్రవారం వరకు మండలంలోని సర్పంచ్ స్థానాలకు 139, వార్డు స్థానాలకు 658 నామి నేషన్లు వచ్చాయి. అర్ధరాత్రి వరకు నామి నేషన్లు వేసేందుకు అభ్య ర్థులు కేం ద్రాల వద్ద ఉండడంతో పూర్తిస్థాయి సమాచారం రాలేదు.

● ఇల్లందకుంట: మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 104, వార్డు స్థానాలకు 307 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని సర్పంచ్ స్థానాలకు మొత్తం 167, వార్డు స్థానాలకు 464 నామి నేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు తెలిపారు.

● జమ్మికుంట రూరల్: మండలంలోని 20 గ్రామపంచాయతీ శుక్రవారం సర్పంచ్ స్థానా లకు 157, వార్డు స్థానాలకు 563 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని సర్పంచ్ స్థానా లకు మొత్తం 206, వార్డు స్థానాలకు 757 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



వీణవంక మండలంలో ఐదుగంటల తర్వాత నామినేషన్ వేసేందుకు క్యూలో ఉన్న అభ్యర్థులు

ప్రభుత్వానికి, పార్టీకి వారధిగా నిలవాలి..

- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్
- డీసీసీ అధ్యక్షుడిగా మేడిపల్లి సత్యం బాధ్యతల స్వీకరణ



మేడిపల్లి సత్యంను, మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లిని గజమాలతో సన్మానిస్తున్న కార్యకర్తలు

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, పార్టీకి డీసీసీ అధ్యక్షుడు వారధిగా నిలవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం డీసీసీ కార్యాలయంలో రిజిష్టర్‌లో సంతకం పెట్టి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పార్టీని ముందుకు తీసుకుపోయే విధంగా కార్యచరణను చేపట్టాలన్నారు. పార్టీ కార్యకర్తల సమస్యలను తెలుసుకుని, పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించి వెన్నుదన్నుగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాటాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గడీల పాలనపై పోరాడిన నాయకులందరికీ పార్టీలో తగిన గుర్తింపు లభించిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు.

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పార్టీ తనపై గురుతర బాధ్యతను ఉంచిందని, అధిష్ఠానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని పార్టీని పటిష్ట పరుస్తామన్నారు. తను అడగన్పటికీ డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారని, పార్టీకి చేసిన సేవలకు ఇది గుర్తింపని తెలిపారు. కార్యకర్తలకు, నాయకులకు కూడా ఇదే విధంగా గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీ కష్టకాలంలో డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బీఆర్ఎస్ ప్రభుత్వంపై అనేక పోరాటాలు చేశారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో ముందుకు సాగుతామన్నారు. ప్రతిపక్షాల విమర్శలను కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తాను డీసీసీ అధ్యక్షుడిగా నాలుగున్నర ఏళ్లలో పార్టీ పటిష్టానికి సహకరించిన కార్యకర్తలు, నాయకులకు కృత జ్ఞతలు తెలిపారు. మేడిపల్లి సత్యంకు కూడా అదేవిధంగా సహ కారాన్ని అందించాలన్నారు. తనపై నమ్మకంతో మంత్రి పొన్నం ప్రభాకర్ డీసీసీ అధ్యక్షుడిగా నియమించి ప్రోత్సహించాద్నా రు. సమావేశంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణగౌడ్, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్‌కుమార్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కటకం మృత్యుంజయం, సిరిసిల్ల, జగిత్యాల డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, నందయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ప్రణవ్‌బాబు, నర్సింగరావు జువ్వాడి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, రహమత్‌హుస్సేన్, ఎండీతాజ్, కొరివి అరుణ్‌కుమార్, శ్రావణ్ నాయక్, అనిల్‌కుమార్, కర్ర సత్యప్రసన్న పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మంత్రి పొన్నం, మేడిపల్లి

వలసకూలీల పిల్లలను బడిలో చేర్పించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి



శుక్రవారం సభలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): జిల్లావ్యాప్తంగా వలస కూలీలు, కార్మి కుల పిల్లలను గుర్తించి వారిని ప్రత్యేక పాఠ శాలల్లో చేర్పించాలని కలెక్టర్ పమేలాసత్పతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మం డల విద్యాధికారులు, ఇటుక బట్టీలు, పరిశ్రమల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వలస కూలీల నివాసం ఉండే ప్రాంతాలకు సమీపంగా ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక తరగతిలో బోధిస్తున్నామన్నారు. ఇటుక బట్టీలు, పరిశ్ర మల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలని ఆదేశించారు. వారికి పౌష్టికాహారం, దుస్తులు, పుస్తకాలు అందిస్తామన్నారు. ఇటుక బట్టీల యజమానులు కూలీల పిల్లలకి రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు.

● 'పది' విద్యార్థులపై దృష్టిపెట్టండి :

పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి వంద శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని కలెక్టర్ పమేలాసత్పతి ఎంఈవోలను ఆదేశించారు. పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్ ఇచ్చామని, వాటిని విధిగా వినియోగించాలని అన్నారు. సమావేశంలో డీఈవో మొండయ్య, విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

● అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్పించాలి

తిమ్మాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నా రులను చేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ కాకతీయ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నారన్నారు. పిల్లల ఆరోగ్యం, పోషణపై అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారిస్తారని, ఇది చిన్నారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వైద్య ఆరో గ్య శాఖ ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మెప్మా పీడీ స్వరూ పారాణి, ఇంచార్జ్ సీడీపీవో శ్రీలత, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, డీహెచ్ ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ శ్రీలత, సఖి కేంద్రం అడ్మిన్ లక్ష్మి, మెప్మా డీఎంసీ శ్రీవాణి పాల్గొన్నారు.

పోలీసులకు సమాంతరంగా సేవలు
- అయినా గుర్తింపునకు నోచుకోని హోంగార్డులు
- ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డు, కారుణ్య నియామకాల కోసం దీర్ఘకాల పోరాటం...
- నేడు హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం 7

విచ్చలవిడిగా బెల్టుషాపులు
- ఎన్నికల సమయంలోనే నియంత్రణ 6

కోతులు బాబోయ్..

- ఇళ్లలోకి వెళ్లి సామగ్రి ధ్వంసం
- అడ్డుకుంటే మూకుమ్మడిగా దాడి
- భయాందోళనలో పట్టణవాసులు

హుజూరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతున్నది.. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. హుజూరాబాద్ పట్టణంలో కోతుల బెడద ఉన్నప్పటికి మున్సిపల్, అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. కోతులు ఇళ్లలోకి చొరబడి సామగ్రిని పాడు చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎవరైనా వారించడానికి సాహసం చేస్తే మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల, బోర్నపల్లి, రంగాపూర్, రాంపూర్, సిర్సపల్లి గ్రామాల్లో గుట్టలు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం గ్రానైట్, క్రషర్ వ్యాపారులకు లీజ్‌కు ఇచ్చారు. లీజ్‌కు తీసుకున్న వ్యాపారులు బండను తొలిచేందుకు బాంబులు పెట్టడడంతో భయ పడి కోతులన్నీ గ్రామాలు, పట్టణాల్లోకి చేరాయి. పట్టణంలోని విద్యానగర్, గాంధీనగర్, కాకతీయకాలనీ, కిందివాడ, మామిండ్లవాడ, ఇలా ఏ కాలనీలో చూసిన కోతుల సంచారం అధికంగా ఉంది. సుమారు నాలుగేళ్ల క్రితం మున్సిపల్ అధికారులు పట్టణంలో కోతులు పట్టించారు. కొంతకాలం పాటు వీటి బెడద లేదు. తర్వాత మళ్లీ కోతుల రాక పెరిగింది. రోడ్లపైన వెళ్తున్న వారిని గాయపరుస్తున్నాయి. ఈ విషయంలో మున్సిపల్, అటవీ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.



హుజూరాబాద్ ఓ ఇంటి ప్రహారీపై ఉన్న కోతులు

ప్రతీ ఒక్కరు రక్త పరీక్షలు చేయించుకోవాలి

● జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిదా అన్సారి

మానకొండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రక్త పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిదా అన్సారి సూచించారు. మానకొండూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కేంద్రాన్ని ఆమె సందర్శించి రక్త హీనత ఉన్న విద్యార్థులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తి గత శుభ్రత పాటించాలని సూచించారు. శానిటేషన్‌పై అవగాహన కల్గి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఎండీ సల్మాన్, రాజునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



మానకొండూర్‌లో రక్త పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సాజిదా అన్సారి

వృద్ధ దంపతుల అనుమానాస్పద మృతి



నర్సింగాపూర్‌లో విచారిస్తున్న ఏసీపీ మాధవి

వీణవంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి కొమురారెడ్డి(90), భార్య సింగిరెడ్డి చిలుకమ్మ(70) దంపతులు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. వృద్ధదంపతుల కూతురు కొత్తిరెడ్డి సరోజన శుక్రవారం ఎప్పటిలాగే ఎలబాక నుంచి తల్లిదండ్రులను చూసేందుకు గ్రామానికి వచ్చింది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇద్దరు రెండు మంచాల్లో మృతిచెంది ఉన్నట్లు గుర్తించింది. ఇంటి పక్కన ఉన్నవారికి సమాచారం అందించింది. కొమురారెడ్డి కొంతకాలంగా అనారోగ్యానికి గురై మంచాన పడ్డాడని, జీవితంపై విరక్తిచెంది ఇద్దరు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని కూతురు సరోజన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. హుజురాబాద్ ఏసీపీ మాధవి సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. దంపతుల మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఉరి వేసుకొని బీటెక్ విద్యార్థి బలవన్మరణం



అభినయ్‌సుదన్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి గ్రామంలో ఓ బీటెక్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కొక్కొండ రమేష్-రజితల కుమారుడు అభినయ్ సుదన్(19) మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లోని బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. అభినయ్‌సుదన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన పవర్‌లూం కార్మికుడు ఎల్లా రమేష్(41) ఆత్మహత్యకు చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గతంలో రమేష్ పవర్‌లూం కార్మికుడిగా పనిచేశాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై అందిన కాడికి అప్పులు చేశాడు. ఈ విషయమై భార్య లత మందలించడంతో ఈనెల 3వ తేదిన ఇంటి నుంచి వెళ్లిన రమేష్ మండల కేంద్రం శివారు మానేరు నదిలో దూకి ఆత్మహత్య చేసుకుని శుక్రవారం శవమై కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తొంటి రమేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగునూర్-జూబ్లీనగర్‌ల మధ్య నవంబరు 30న రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కరీంనగర్‌రూరల్ మండలం చామనపల్లికి చెందిన తొంటి రమేష్(20) చికిత్సపొందుతూ మృతిచెందాడని కరీంనగర్ రూరల్‌సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా తీవ్రంగా గాయపడిన రమేష్‌ను కుటుంబసభ్యులు హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడచికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతిచెందాడని తెలిపారు. మృతదేహానికి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసినకేసులో నిందితుడు మాడుపు నరసింహచారి(35)కి 20 సంవత్సరాలు జైలుశిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపుసెషన్స్ న్యాయమూర్తి వెంకటేష్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... బాలిక(11) ఏడవతరగతి చదువుతున్నది. బాలిక ఇంటిపక్కనే నిందితుడు మాడుగు నరసింహచారి తనతల్లితోకలిసి కిరాయి ఉంటున్నాడు. పక్కపక్కనే ఇల్లు ఉండడంతో బాధిత బాలిక తరచూ నిందితుడు నరసింహచారి ఇంటికి వెళుతుండేది. ఆ క్రమంలో అక్కడనే పడుకుంటూ ఉండేది. అదే అలుసుగా తీసుకున్న నిందితుడు బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. వయస్సువచ్చిన తరువాత వివాహం చేసుకుంటానని నమ్మించి రెండుసార్లు అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి నిందితుడి తల్లిని అడిగితే నాకొడుకుకు నీ కూతురును ఇచ్చి పెళ్లి చేయమని దబాయించింది. ఈ విషయమై సదరు బాధితురాలు 2022మార్చి 2న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమేరకు పోలీసులు నిందితుడు నరసింహాచారిపై భారతీయ శిక్షాస్మృతిలోని అత్యాచారం కేసుతోపాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. అప్పటి సీఐ శ్రీనివాసరావు కేసు విచారణజరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి శరత్ కోర్టులో సాక్షులను హాజరు పరిచి వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి వెంకటేష్.. నిందితుడిపై కేసు రుజువుకావడంతో నిందితుడు మాడుపు నరసింహాచారికి 20ఏళ్ల జైలు శిక్షతోపాటు వెయ్యిరూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పుచెప్పారు. ఈకేసులో సమర్థవంతంగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన అప్పటిఇన్‌స్పెక్టర్(ఏసీపీ) తుల శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి శరత్, ఇతర పోలీసు అధికారుల బృందాన్ని పోలీస్‌కమిషనర్ అభినందించారు.

బోరు మోటార్ల చోరీ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని బోరు మోటార్ల మరమ్మతు దుకాణం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బోరు మోటార్లను గురువారం రాత్రి అపహరించుకుపోయారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బంజేరు గ్రామానికి చెందిన బాబు మండలకేంద్రంలో బోరు మోటార్ల మరమ్మతు దుకాణం నడుపుతున్నాడు. మరమ్మతు కోసం రైతులు తీసుకు వచ్చినమోటార్లను దుకాణంలోంచి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. చోరీ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

- ఎన్నికల సమయంలోనే నియంత్రణ
- గ్రామాల్లో ఇష్టారీతిన మద్యం విక్రయాలు



కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజజ్యోతి): గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు వెలుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో నియంత్రణ చేపడుతున్నా ఆ తర్వాత గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని మద్యం బెల్ట్ షాపులను మూసివేయిస్తున్నారు. గ్రామాల్లో, రోడ్ల పక్కన విచ్చలవిడిగా కిరాణాషాపులకు రెట్టింపు సంఖ్యలో మద్యం బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి, నిబంధనలకు విరుద్ధంగా 24 గంటల పాటు యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుపుతున్నప్పటికీ ఎక్సైజ్, ఇటు పోలీసుశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు పట్టించుకోవటం లేదు. మద్యం మత్తులో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని నివేదికలు చెపుతున్నా బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. బెల్ట్‌షాపులతో పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు ఆర్థికపరమైన లాభాలుండటంతోనే వీటి పై కన్నెత్తి చూడటంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అత్యధిక ఆదాయం సమకూర్చిపెడుతున్న మద్యం అమ్మకాలపై ప్రభుత్వ వైఖరి కూడా చూసి చూడనట్లుగా ఉన్నది. ప్రజల ప్రాణాలకు భద్రత, రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగునీరు సైతం దొరకని గ్రామాల్లో అర్ధరాత్రి వేళ కూడా మద్యం చేయి చాచితే అందు బాటులో ఉండేలా గల్లీ గల్లీకి బెల్ట్‌షాపులు ఏర్పడ్డాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6 వేలకుపైగా బెల్ట్‌షాపులు మద్యం విక్రయాలను చేస్తున్నట్లు అంచనా.



• ఎన్నికల వేళ అధికారుల తనిఖీలు

ఎన్నికల సమయంలో పల్లెలు, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ పోలీసుశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల వేళ గ్రామాలలో రాజకీయ పార్టీలు, వర్గాల మధ్య గొడవలు జరుగకుండా, పల్లెల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలుగకుండా మద్యం విక్రయాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గ్రామాలలో బెల్ట్‌షాపులను పోలీసులు మూసివేయిస్తూ నిర్వాహకులను తహసీల్దార్‌ల ఎదుట బైండోవర్ చేస్తున్నారు.

• ఆర్థికంగా చితికిపోతున్న పేద, కార్మిక కుటుంబాలు

గ్రామాలు, పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులతో గ్రామీణ ప్రాంత పేదలు, కార్మికుల కుటుంబాల జీవనం కల్లోలంగా మారుతున్నది. గ్రామాలలో బెల్ట్‌షాపుల ఏర్పాటుపై కొన్ని ప్రాంతాల్లో మహిళలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మహిళలు ఉద్యమిస్తూ మద్య నిషేధం తీర్మానం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో గ్రామాలలో బెల్ట్‌షాపుల నిర్వహణకు అనధికారిక లైసెన్స్‌ల కోసం గ్రామ చావడిలో వేలం పాటలు నిర్వహించి షాపులను ఖరారు చేసుకుంటున్నారు. ఒక్కో షాపుకు లక్ష నుంచి 5 లక్షల రూపాయల వరకు కూడా పాడిన సందర్భాలు ఉన్నాయి. పల్లెల్లో మద్యం అమ్మకాల కారణంగా తమ కుటుంబాలు నాశనమై పోతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్‌షాపుల ద్వారా నెలనెలా ఎక్సైజ్, పోలీసు అధికారులకు, అండగా నిలుస్తున్న రాజకీయ నాయకులకు లక్షలాది రూపాయల ముడుపులు ముడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

నాటుసారా పట్టివేత

గంభీరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మక్తానాయక్ తండాలో 5లీటర్ల నాటుసారాను పట్టుకున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. మక్తానాయక్ తండాకు చెందిన బలరాం అనేవ్యక్తి గుడుంబా తయారు చేస్తున్నట్లు పక్కాసమాచారం మేరకు తనిఖీ చేయగా 5లీటర్ల నాటుసారా లభ్యమైనట్లు తెలిపారు. లభ్యమైన నాటుసారా సీజ్‌చేసి, బాధ్యుడైన బలరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రారక్టర్లను శుక్రవారం పట్టుకుని, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. గ్రామాలలో మద్యం అమ్మేవారు, కేసులు ఉన్నవారు, ఉద్రిక్త పరిస్థితులు కల్పించే వారిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. శుక్రవారం బైండోవర్ చేసిన ఇద్దరితో కలిపి ఇప్పటి వరకు 183మందిని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్థుల ఆందోళన



అన్నారంలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మానకొండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్-జమ్మికుంట డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా అన్నారంలో నిలిచిన రోడ్డు పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నారంలో ఆందోళన చేపట్టారు. వాహనాల రాకపోకలతో దుమ్ము ఇళ్లలోకి చేరుతోందని, ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఐ స్వాతి ప్రతీరోజు రోడ్డుపై నీరు పోసేలాచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

మానేరు చెక్‌డ్యామ్‌ను పేల్చివేశారు

- జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్



గుంపుల చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న ప్రకాష్

ఓదెల/జమ్మికుంట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంపుల తనుగుల మధ్య ఉన్న మానేరులో నిర్మించిన చెక్‌డ్యామ్ కూలిపోవడం నాణ్యత లోపం కాదని, ఇది ముమ్మాటికి పేల్చివేతేనని జలవనరుల శాఖ మాజీ చైర్మన్ ప్రకాష్ అన్నారు. నవంబర్ 21న, చెక్ డ్యామ్ పేల్చి వేసినట్లు ఫిర్యాదు చేయగా, 22న, ఎఫ్ఐఆర్ అయిందని, ఇప్పటివరకు కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. శుక్రవారం నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో గుంపుల, తనుగుల చెక్ డ్యామును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ, సంఘటన స్థలంలో జిలెటిన్ స్టిక్స్ దొరికినా, కొందరు నాణ్యతాలోపం అనడం విడ్డూరమని తెలిపారు. దిగువనున్న వావిలాల చెక్ డ్యామ్ నాణ్యతలోపం వల్ల కుంగిపోయిందన్నారు. ఇది మాత్రం కచ్చితంగా పేల్చివేతేనని తెలిపారు. నవంబర్ 21న, సంఘటన స్థలానికి సంబంధించిన ఇంజనీరింగ్ రవి కూడా పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారని, అనంతరం లేబలెటర్లో పరీక్ష చేసిన తర్వాత ఇది పేల్చినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. ఇసుకను అమ్ముకొని సొమ్ము చేసుకోవడానికి ఈ సంఘటనకు పాల్పడ్డట్లు తెలిపారు. రైతుల కోసం కట్టిన చెక్ డ్యాముల్లో కొంత మేరకే నష్టం వాటిల్లినప్పటికీ ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు జరగలేదని తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి కోసం కేసీఆర్ వందలాది కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాములు రైతులకు ఉపయోగపడేవని, చెక్ డ్యామును పరిశీలించిన తర్వాత ఇది కచ్చితంగా పేల్చివేతేనని నిపుణులు కూడా తేల్చి చెప్తున్నారని అన్నారు. అయినా కూడా ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని తెలిపారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్లు సీతారామారావు, రాఘవరెడ్డి, జలవనరుల శాఖ మాజీఇంజనీర్లు దామోదర్‌రెడ్డి, వెంకటేశం శ్రీధర్ రావుదేష్ పాండే, వికాస జిల్లా అధ్యక్షుడు మల్లోజుల విజయ నంద్, వి.కా.స. ఎర్రోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
- 30క్వింటాళ్ల పత్తి దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పత్తి

వేములవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ఆస్తినష్టం జరిగిన సంఘటన వేములవాడ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన పెరుగు జలందర్ అనేరైతు ఇంట్లో పత్తిని నిల్వచేశాడు.

షార్టుసర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సుమారుగా 20నుంచి 30క్వింటాళ్ల వరకు పత్తి అగ్నికి దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఇంట్లో పత్తి నిల్వ ఎక్కువగా ఉండటంతో మంటలు క్షణాల్లో ఎగిసిపడ్డాయి. అదృష్టవశాత్తు ఇంటిలో ఎవరూలేకపోవడంతో ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు.

మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా నివారించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. నష్టపోయిన రైతును అధికారులు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

గడ్డిట్రాక్టర్ దగ్ధం



కాలిపోతున్న గడ్డి, ట్రాక్టర్

ఎలిగేడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డిలోడ్‌తో వెళ్లుతున్న ట్రాక్టర్‌కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్‌లోని రేగులగడ్డ ప్రాంతం నుంచి శివపల్లికి గడ్డిలోడ్‌తో వెళ్లుతున్న ట్రాక్టర్‌కు అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. మంటలు ఒక్కసారిగా ఎగిసిపండటంతో డ్రైవర్‌గమనించి ట్రాక్టర్‌నురోడ్డుపై నిలిపివేశాడు. ఈ మంటల్లో గడ్డితోపాటు ట్రాలీ, ఇంజను, టైర్లు కాలిపోయాయని తెలిపారు.

దొంగ అరెస్ట్..

- రూ.3,92,500 స్వాధీనం



దొంగను అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి డబ్బుల బ్యాగును దొంగిలించిన కేసులో బండారి బాలరాజును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్లడీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. అతనిదగ్గర నుంచి రూ3లక్షల 92వేల 500లను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో టౌన్‌సీఐ కృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. వేములవాడ పట్టణానికి చెందిన నార్ల శ్రీనివాస్ అనే వ్యాపారి హైదరాబాదులోని హోల్‌సేల్ దుకాణాలకు చెల్లించాల్సిన రూ.3లక్షల92వేల500 నగదుతో పాటు ఇతరపత్రాలను బ్యాగ్‌లో ఉంచుకొని ఈనెల3న వేములవాడ బస్టాండ్‌వద్ద బస్సు ఎక్కాడు. కొంతసేపటి తర్వాత తనబ్యాగు కనిపించకపోవడంతో సిరిసిల్ల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీపుటేజీల ఆధారంగా నిందితుడిని వేములవాడ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బండారి బాలరాజుగా గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి మొత్తం నగదును రికవరీచేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కేసును ఛేదించిన పట్టణసీఐ కృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, నాగరాజు, రవికుమార్‌ను డీఎస్పీ అభినందించారు.

అవినీతి నిర్మూలనకు కట్టుబడి ఉండాలి

- ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు సమాజంలోని ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని, అప్పుడే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు కరీంనగర్‌లోని ఏసీబీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డిసెంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. అవినీతి నిరోదకశాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని చెప్పారు. అవినీతిపై 1064టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను విడుదల చేసిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఈ ఏడాది 32 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

కొనుగోలు కేంద్రం నుంచి 10 ధాన్యం బస్తాలు చోరీ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు శుక్రవారం చోరీకి గురయ్యాయని బాధిత రైతు భూక్య సురేశ్ పేర్కొన్నాడు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని రైతు భూక్య సురేశ్ తనకున్న రెండు ఎకరాల్లో వరి పంటను కోసి కేంద్రానికి తరలించాడు. గతనెల 29న నిర్వాహకులు తూకం వేసిన 101 ధాన్యం బస్తాలను కేంద్రంలోనే నిల్వ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు అందులో నుంచి 10 సంచులను ఎత్తుకెళ్లారు. ధాన్యం తరలింపులో జాప్యం వల్ల తన ధాన్యం బస్తాలను అపహరించుకుపోయారని బాధిత రైతు సురేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

అధికారులు స్పందించి కేంద్రంలోని ధాన్యం బస్తాలను తరలించడంతో పాటు చోరీకి గురైన ధాన్యం సంచులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరాడు.

ద్విచక్ర వాహనానికి సైడ్ ఇవ్వలేదని.. బస్సు డ్రైవర్‌పై దాడికి యత్నించిన యువకుడు

వేములవాడ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించిన యువకుడు తన ద్విచక్ర వాహనానికి సైడ్ ఇవ్వలేదని ఏకంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి యత్నించిన సంఘటన వేముల వాడలో శుక్రవారం చోటుచేసుకుంది. వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల నుంచి మొదటి బైపాస్ మీదుగా వేములవాడ బస్టాండ్ వైపు వస్తోంది. ప్రయాణికులను దింపుతూ వస్తుండగా ఎక్కడపడితే అక్కడ బస్సు ఆపుతూ తన ద్విచక్ర వాహనానికి సైడ్‌ఇవ్వడం లేదని ఓ యువకుడు ఆగ్రహం చెందాడు. ఏకంగా రోడ్డుకు అడ్డంగా తన ద్విచక్రవాహనాన్ని నిలిపి ఆర్టీసీ బస్సును అడ్డుకున్నాడు.

బస్సు డోర్ వద్దకు చేరుకొని డ్రైవర్, కండక్టర్లపై తిట్ల పురాణం అందుకోవడమే కాకుండా దాడికి యత్నించాడు. సంఘటనను చిత్రీకరిస్తున్న ప్రయాణికులను సైతంతిట్టి సెల్‌ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటనతో ప్రయాణికులు భయాందోళనచెందగా పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఇటీవల ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన సంఘటన మరవకముందే వేములవాడ ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్‌పై ఆ యువకుడు వ్యవహరించిన తీరుతో ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

కన్నుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాళ్ల చెరువు ప్రాంతంలోని గుంటి పురుమాండ్ల రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. దేవాలయంలో వేద పండితులు శంకర్ శర్మ, పణీంద్ర శర్మ, ఆరుణ్ శర్మ, కాశిక్ చారి, సునిల్‌ల మత్రోత్సరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవాలయంలో మూల విరాట్‌కు అర్చన అభిషేకాలను జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ మూర్తులను రథంలో ఉంచి రతోత్సవంను నిర్వహించారు. రథోత్సవంలో ఉన్న స్వామిని దేవాలయం చుట్టు ప్రదక్షణను నిర్వహించిన భక్తులు రథం లాగి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎబీన్‌పూర్, కోరుట్ల పట్టణంకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

తెలంగాణ అండర్-19 చెస్ జట్టుకు కోచ్‌గా అనూప్ కుమార్



అనూప్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో ఈ నెల 5 నుంచి 7 వరకు జరగనున్న 69వ కళాశాలల అండర్-19 జాతీయ స్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు జిల్లాకు చెందిన కంకటి అనూప్ కుమార్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో పలుమార్లు తెలంగాణ చెస్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన అనూప్ అండర్-19 జట్టుకు కూడా కోచ్‌గా వ్యవహరించడం విశేషం. ఈ సందర్భంగా అనూప్‌కు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలంపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు అభినందించారు.

పోలీసులకు సమాంతరంగా సేవలు



అయినా గుర్తింపునకు నోచుకోని హోంగార్డులు

- ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డు, కారుణ్య నియామకాల కోసం దీర్ఘకాల పోరాటం...
- నేడు హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులతో సమానంగా తమకు గుర్తింపు లభించటం లేదని హోంగార్డులు వాపోతున్నారు. పోలీసు శాఖకు అనుబంధంగా పని చేస్తున్న హోంగార్డులు దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఇటు ప్రభుత్వం అటు పోలీసు శాఖలు పరిష్కరించలేక పోవడంతో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. పోలీసులు నిర్వహించే ట్రాఫిక్, సివిల్ విధులతోపాటు అధికారుల వాహనాలకు డ్రైవర్లుగా, పోలీసు కార్యాలయాల వద్ద విధులను హోంగార్డులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం హోంగార్డుల సమస్యలు పరిష్కరించకుండా వెట్టి చాకిరి వ్యవస్థగానే చూస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. గత ఏడాది సీఎం కేసీఆర్ హోంగార్డుల వేతనాలను తొమ్మిది వేల నుంచి 12 వేలకు పెంచారు. పనికి తగిన వేతనం లభించడంలేదనే అసంతృప్తి హోంగార్డులో నెలకొన్నది.

స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించి..

హోంగార్డుల వ్యవస్థ దేశ సరిహద్దుల్లో 1959లో పోలీసులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు స్వచ్ఛంద దళంగా ఆవిర్భవించింది. కాలక్రమేణా పోలీస్ శాఖకు అనుబంధంగా కొనసాగిస్తూ 1983లో హోంగార్డులకు దినసరి వేతనాలు అందజేశారు. ఆ తరువాత నెలసరి వేతనాలు చెల్లిస్తున్నారు. ఉద్యోగం శాశ్వతం కాక పోవడంతోపాటు రోజు రోజుకు పెరుగుతున్న ఖర్చులతో ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు సరిపోవడం లేదని హోంగార్డులు వాపోతున్నారు. పోలీసు శాఖతోపాటు అగ్నిమాపకశాఖ, రవాణాశాఖ, కోర్టు, ఆర్టీసీ తదితర ప్రభుత్వ శాఖల్లో హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రోజువారి గౌరవ వేతనం వెయ్యి రూపాయలు ఇస్తారు. ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు అదనంగా 30 శాతం అలవెన్స్ వసుంది. పదవీ విరమణ పొందిన హోంగార్డులకు ఎలాంటి ఆర్థిక సహకారం లభించడం లేదు. 30 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి, ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరగబోయే 63వ హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని డీజీపీ ఉత్తర్వులు ఇవ్వడంతో హోంగార్డులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,127 మంది హోంగార్డులు ఉన్నారు.

ప్రధాన డిమాండ్లు

- 2017 ఎస్‌పీఏ ఉత్తర్వులను అమలు చేసి హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- మరణించిన హోంగార్డు కుటుంబాలకు కారుణ్య నియామకాలు కింద ఉద్యోగ సౌకర్యం కల్పించాలి.
- 2025 సంవత్సరంలో మరణించిన హోంగార్డు కుటుంబాలకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐదు లక్షల రూపాయలు అందజేయాలి.
- హోంగార్డులకు ఆరోగ్య భద్రత కార్డు సౌకర్యం కల్పించాలి.
- పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్ నిధులు విడుదల చేయాలి.
- పదవీ విరమణ పొందిన హోంగార్డులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలి.
- కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఇచ్చిన సడలింపులు హోంగార్డులకు ఇవ్వాలి.
- వేతనంలో కోత లేకుండా వారంలో ఒక సెలవు ఇవ్వాలి
- మహిళా హోంగార్డులకు ఒక నెల వేతనంతో కూడిన ప్రసూతి సెలవు కల్పించాలి.
- ఐదు సంవత్సరాల సర్వీసు కలిగిన హోంగార్డులకు కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించి శిక్షణ ఇవ్వాలి.
- కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపికలో 30 శాతం హోంగార్డులకు రిజర్వేషన్ కల్పించాలి.

విదేశాల్లో ఉన్నత విద్యపై అవగాహన తరగతులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌పై ట్రైనింగ్ క్లాసులకు దరఖాస్తులు కోరుతున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య చదవడంతో పాటు స్కాలర్‌షిప్‌లు పొందడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ నెల 21 వరకు టీజీ బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 040-24071178, 0878- 2268686 నెంబర్లలో ఆఫీసు సమయాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు ట్రాన్స్‌కో సర్కిల్ క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కరీంనగర్ ట్రాన్స్‌కో సర్కిల్ క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధులు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు.

నాందేడ్ నుంచి కొల్లాం ప్రత్యేక రైలు

- ఫలించిన మంత్రి అడ్లూరి కృషి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాందేడ్ నుంచి జగిత్యాల మీదుగా అయ్యప్పస్వాముల కోసం ప్రత్యేక రైలు నడపాలని కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ సెక్రటరీ బోగోజీ ముఖేష్ ఖన్నా రైల్వే అధికారులు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు విన్నవించారు. స్పందించిన మంత్రి దక్షిణ మధ్య రైల్వే జీఎంతో మాట్లాడి ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించారు. డిసెంబరు 24, జనవరి 7 తేదీల్లో నాందేడ్ నుంచి కొల్లం వరకు(శబరిమల) ప్రత్యేక రైలు అందుబాటులో ఉండనుంది.

సీసీఎల్‌ఏ భూముల రిజిస్ట్రేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

- దేవాదాయశాఖ ఉప కమిషనర్ సునీత

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 5: దేవాదాయశాఖకు చెందిన సీసీఎల్‌ఏ (చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) భూముల రిజిస్ట్రేషన్ పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్, వరంగల్ జోన్ ఉప కమిషనర్ సునీత సూచించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. రాష్ట్ర కమిషనర్, ఉప కమిషనర్ ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారని అన్నారు. ఆలయాల భూములు 43వ సెక్షన్ కింద రిజిస్ట్రేషన్ చేసే ముందు పూర్వ రికార్డులైన కాస్ర, సేతువర్, చెస్ల వంటి వాటిని సేకరించి వాటిలో సర్వే నెంబర్లు ధ్రువీకరణ చేయాలని తెలిపారు. వివరాలను 22-ఏ(ఐ)సి ప్రొఫార్మాలో నమోదు చేసి రికార్డులను రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. సమావేశంలో ఉమ్మడి జిలా సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్లు, కార్యనిర్వహణాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ సునీత

నామినేషన్‌ను అనుమతించండి

- కోర్టును ఆశ్రయించిన అభ్యర్థి

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో రామగిరి మండలం పెద్దపేట సర్పంచ్ అభ్యర్థి చింతపట్ల సుహాసిని హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 29న సర్పంచ్ అభ్యర్థిగా సుహాసిని నామినేషన్ దాఖలు చేశారు. నామినేషను తీసుకున్న అధికారులు గత నెల 30న జరిగిన నామినేషన్ల పరిశీలనలో ఆమె పేరు గ్రామ ఓటర్ల జాబితాలో లేకపోవడంతో నామినేషన్‌ను తిరస్కరించారు. కాగా తన కుటుంబ సభ్యుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయని, తన ఓటు గల్లంతు అయిందని తనకు సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం కల్పిస్తూ నామినేషన్‌ను ఆమోదించాలని కోరుతూ సుహాసిని హైకోర్టును ఆశ్రయించారు.

అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తే చర్యలు

పెద్దపేట గ్రామ సర్పంచ్ ఎన్నికల విషయంలో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నట్టు తమకు ఎటువంటి కోర్టు ఆదేశాలు అందలేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటనలో పేర్కొన్నారు. అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఆర్టీసీ స్థలంలో ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

కోరుట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్థలంలో అధికారులు నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణంపై రగడ మొదలైంది. ప్రహరీ నిర్మాణంపై చట్టు పక్కల కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేయ్యడంతో నిర్మాణం వివాదాస్పదంగా మారింది. కోరుట్ల ఆర్టీసీ డిపోకు చెందిన ఎకరం ఇరవై గుంటల స్థలంలో ఇటీవల కొందరు స్థలం మాదంటూ మట్టి పోసి చదను చేసిన విషయం తెలిసిందే. స్థల ఆక్రమనకు పాల్పడిన వారిపై డిపో అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం కోరుట్ల ఆర్‌టీసీ డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో ఆర్‌టీసీ అధికారులు ఆ స్థలంలో రాళ్లతో హద్దులను ఏర్పాటు చేసారు. ఆర్‌టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థల పరిరక్షణ కోసం ప్రహరీ నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న చుట్ట పక్కల కాలనీ వాసులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుంచి ఈ ప్రాంతం నుంచి రాకపోకలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డుకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డీఎం మనోహర్‌కు వినతిపత్రం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిరంజీవి అక్కడి చేరుకుని కాలనీవాసులను సముదాయించారు.



డిపో మేనేజర్‌తో మాట్లాడుతున్న కాలనీ వాసులు

రూ.7,300 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7300 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 50మంది రైతులు 464 క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7300, కనిష్ఠ ధర రూ.6400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జి రాజు దగ్గరుండి పర్యవేక్షించారు. శని, ఆదివారాలు సాధారణ సెలవుదినాలు కాగా, సోమవారం తిరిగి పత్తి క్రయవిక్రయాలు ప్రారంభం కానున్నాయి.

చిల్లర నాణేలతో నామినేషన్

ఇల్లందకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మారపెల్లి సృజన్‌బాబు వినూత్న రీతిలో శుక్రవారం నామినేషన్ వేశారు. ఇల్లందకుంటలో నామినేషన్ వేసేందుకు అభ్యర్థి సృజన్‌బాబు సాయంత్రం 4గంటలకు కేంద్రానికి చేరుకోగా రిటర్నింగ్ అధికారి 31 టోకెన్ ఇచ్చారు. ఆఖరి టోకెన్ కావడంతో అతను చిల్లర నాణెలు వెయ్యి రూపాయలు ఇచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అధికారులు అప్పటికే రాత్రి 10గంటలు కాగా, వాటిని లెక్కించేందుకు కొంత సమయం పట్టింది. ఈ విషయంపై సృజన్‌బాబును అడుగగా రూపాయి విలువ తగ్గలేదని చెప్పేందుకు ఈ నిర్ణయం తీసుకొని నామినేషన్ వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు చెప్పారు.



చిల్లర నాణెలను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

సర్పంచ్‌లో బరిలో 80 ఏళ్ల వృద్ధురాలు

- జనరల్ మహిళ రిజర్వు
- ఉప్పట్ల పోటీలో అందరూ ఎస్సీ మహిళలే

మంథని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పట్ల గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయంగా చర్చనీయాశంగా మారాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీల కోసం అంతా యువతా ఉత్సాహం చూపుతుండగా.. వారి కంటే నేనేం తక్కవ కాదంటూ.. ఉప్పట్ల గ్రామ సర్పంచ్‌గా కాసిపేట వెంకటమ్మ అనే వృద్ధురాలు నామినేషన్ దాఖలు చేశారు. 80 ఏళ్ల వయస్సులో సైతం గ్రామ ప్రజలకు సేవ చేయటానికి ముందుకు వచ్చిన వెంకటమ్మను అందరూ అభినందిస్తున్నారు. ఉప్పట్ల గ్రామ సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వు కాగా ప్రస్తుతం సర్పంచ్ పోటీలో ఉన్న ముగ్గురు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే ఉండటం గమన్హారం. గ్రామంలోని 8 వార్డుల్లో 4 వార్డులు జనరల్‌గా రిజర్వు కాగా, మరో నాలుగు ఎస్సీలకు రిజర్వు అయ్యాయి.

అయితే మొత్తం 8 స్థానాల్లో సైతం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే పోటీలో ఉండటం చర్చనీయాంశంగా మారింది.



సర్పంచ్‌గా పోటీ చేస్తున్న కాసిపేట వెంకటమ్మ

దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంత్రి పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్



స్పీడ్ బోట్‌లో స్వామి దర్శనానికి వెళ్తున్న మంత్రి, విప్

బోయినపల్లి, డిసెంబర్, 5 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని శ్రీ దత్తాత్రేయ స్వామివారిని వేడుకున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బోయినపల్లి మండలంలోని వరదవెల్లి గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి గుట్టపై జరుగుతున్న దత్త జయంతి ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బోట్‌లో మంత్రి పొన్నం, విప్ ఆది గుట్టపై చేరుకున్నారు. సందర్భంగా దత్తాత్రేయ స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ విప్ ఆది శ్రీనివాస్‌లకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి చిత్రపటాలను, ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దత్త జయంతి ఉత్సవాల సమయంలోనే కాకుండా ప్రతి రోజు దర్శనం కోసం బోట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ ఛైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్, మండల పార్టీ అధ్యక్షులు వెన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేములవాడలో భక్తుల రద్దీ



భీమేశ్వరాలయంలో భక్తులు



క్యూలైన్‌లో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 05(ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరస్వామి దేవస్థానం భక్తజనసంద్రమైంది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 25వేలకు పైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. వేలాదిమంది భక్తులు కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. నిత్యఅన్నదాన సత్రం పై అంతస్థులో కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు స్వామివారికి మహాలింగార్చన, కుంకుమపూజలు, పెద్ద పల్లకి సేవలు, ఆకుల పూజలు చేసి భక్తిప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రాజరాజేశ్వరస్వామివారిని ఎల్ఈడి స్క్రీన్‌లో దర్శించుకొని తరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఈఈ రాజేష్ క్యూలైన్‌లను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

బద్దిపోచమ్మకు బోనాలు

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. వేలాదిమంది భక్తులతో బద్దిపోచమ్మ ఆలయం రద్దీగా మారింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

యూనివర్సిటీ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎస్సారార్ విద్యార్థులు



మోతె అనిల్



ఎడ్ల విష్ణువర్ధన్



గుగ్గిళ్ల సంతోష్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీలకు నగరంలోని శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ స్థాయి క్రాస్‌కంట్రీ, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు మోతె అనిల్, ఎడ్ల విష్ణువర్ధన్, గుగ్గిళ్ల సంతోష్‌లు హర్యానా రాష్ట్రం రోతక్‌లో దయానంద్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 21న జరిగే అఖిల భారత యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ఇన్‌చార్జి పీడీ డాక్టర్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టి రాజయ్య, డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, డాక్టర్ మీసాల మల్లారెడ్డి, పడాల తిరుపతి తదితరులు అభినందించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్స్‌పాల్

రామగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంథని జేఎన్‌టియూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, అండ్ 17 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కనుంట్ల లక్ష్మన్‌లు ముఖ్యఅతిథిలుగా హాజరై పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, కొమురోజు శ్రీనివాస్, విజయ్, ఖాజాబి, నాలుగు జిల్లాలకు చెందిన అండర్ 14, 17బాల బాలికలు పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్..

అందుబాటులో పోస్టల్ బ్యాలెట్

గంగాధర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ అందుబాటులో ఉంచినట్లు జిల్లా సహాయ ఎన్నికల అధికారి డి.రాము తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లోకి సర్పంచ్ అభ్యర్థి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం సర్పంచ్ అభ్యర్థి ఎల్కటూరి రమేష్ గురువారం కాంగ్రెస్‌లో చేరారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసాల రవీందర్, చల్ల మల్లారెడ్డి, గుజ్జెటి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు బహిరంగ లేఖ

సుభాష్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రూ. 4.5 కోట్ల అవినీతి, అక్రమాలపై ముగ్గురు మంత్రులకు బహిరంగ లేఖ రాసినట్లు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ తెలిపారు. అవినీతి అక్రమాలపై విచారణ జరిపి 20 రోజులవుతున్నా బాధ్యులపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వెంటనే సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రులు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు.

బస్టాండ్ లేక ప్రయాణికుల పాట్లు

- దుకాణాల మెట్లపై బస్సుల కోసం నిరీక్షణ



గన్నేరువరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు పక్కన దుకాణాల మెట్లపై, చెట్ల కింద కూర్చొని బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు వంటి సౌకర్యాలు లేక మహిళలు, పిల్లలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో ఎక్కడా బస్సుల టైం టేబుల్, బస్ స్టాప్‌లను సూచించే బోర్డులు సైతం ఏర్పాటు చేయక పోవడంతో ప్రయాణికులకు బస్సుల రాకపోకల సమయం తెలియడం లేదు. స్థానిక స్కూల్ కాంప్లెక్స్‌లో నిర్మించిన మూత్రశాలను జీపీ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. అధికారులు తక్షణమే స్పందించాలని, బస్‌షెల్టర్‌ను, మూత్రశాలలను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కనీస వసతులు లేవు

● పుల్లెల జగన్మోహన్, గన్నేరువరం



మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్లపై నిలబడి బస్సులు ఎక్కుతున్నారు. సమీపంలో కనీస సౌకర్యాలు లేవు. బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు మరుగుదొడ్లు, మూత్రశాలలు, లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి.

దివ్యాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



బహుమతులు అందజేస్తున్న డీఆర్డీవో శ్రీధర్

తిమ్మాపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అందరూ సంఘాల్లో చేరాలని, బ్యాంకు లింకేజ్, సీఐఎఫ్, స్త్రీ నిధి రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్డీవో శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని వసుంధర మండల సమాఖ్యలోని వికాస్ దివ్యాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు బస్సు, రైలు ప్రయాణల్లో అందిస్తున్న రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైబర్ హండ్ సెంటర్‌లో దివ్యాంగుల అవసరాలకు తగ్గట్టు సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతిభా వంతులను గుర్తించి సన్మానించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమ తులను ప్రదానం చేశారు. అదనపు డీఆర్డీవో రవికుమార్, డీపీఎం సుధారాణి, ఏపీఎం వాణిశ్రీ పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

సైదాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం, సైదాపూర్ నామినేషన్ కేంద్రాలను శుక్రవారం అడిషన్ ల్ కలెక్టర్(లోకల్ బాడీస్): అశ్విని తానాజీ వాంకడే తనిఖీ చేశారు. రిటర్నింగ్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నామినేషన్ లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం అంగన్ వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. అనంగన్ కేంద్రంలో పిల్లల పట్ల అనుసరిస్తున్న వివరాలను అంగన్ వాడి టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ నివాసంలో శుక్రవారం జమ్మికుంట మండలం మాచనపల్లి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ప్రణవ్‌వారికి కుండవా కప్పి ఆహ్వానించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి పాటుపడాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ ప్రకటనలో తెలిపారు. రెడ్డి ఫంక్షన్ హాల్, తేజా స్కూల్, ఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యంకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న నాయకులు

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమాకమైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు శుక్రవారం సాయంత్రం అల్గునూర్ చౌరస్తా వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అల్గునూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాలుర్పించారు. అనంతరం ర్యాలీగా డీసీసీ కార్యాలయం చేరుకున్నారు. కోతిరాంపూర్‌లో చర్ల పద్మ, పడిశెట్టి భూమయ్య ఆధ్వర్యంలో మేడిపల్లి సత్యంను గజమాలతో సన్మానించారు. అనంతరం గాంధీ విగ్రహానికి కమాన్ వద్ద పూలమాల వేశారు. కంకనాల అనిల్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. తెలంగాణ చౌక్‌లో యువజన కాంగ్రెస్ నాయకులు ఫహద్ ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతూ మేడిపల్లి సత్యంకు క్రేన్‌తో భారీ గజమాల వేసి, తలపాగా, ఖడ్గం బహుకరించారు. డీసీసీ కార్యాలయంలో గజమాలతో సన్మానించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ సత్యంను సన్మానించారు. నాయకులు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ కర్ర రాజశేఖర్, మల్యాల సుజిత్‌రావు, చక్రధర్‌రావు, ప్రశాంత్‌దీపక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

భగత్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాళ్ల బండి శంకర్, ప్రసాద్‌రెడ్డి, బొంగోని పర్శ రాములు, ప్రధానోపాధ్యాయిని పద్మాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పతాక దినోత్సవ సహాయ నిధి సేకరణ

కరీంనగర్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్మడ్ ఫ్లాగ్ డే (పతాక దినోత్సవం) సహాయ నిధి సేకరణను ఎన్‌సీసీ కేడెట్లు ప్రారంభించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతిని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీకేడెట్లు కలిశారు. ఈ సందర్భంగా బ్యాడ్జీని అలంకరించి, విరాళాల సేకరణ ప్రారంభించారు. విరాళాలను ఆర్మీసహాయ నిధికి పంపిస్తామని తెలిపారు.

సాధారణ సెలవు ప్రకటించాలి

రాయికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనవరి 29, 30, 31 తేదీల్లో జరుగనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు మూడు రోజులు సాధారణ సెలవులు ప్రకటించాలని తెలంగాణ యాదవ మహాసభ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు ఒక ప్రకనలో తెలిపారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్ గౌడ్

తిమ్మాపూర్, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఓటరు ఎన్నికల నియమావళిని పాటించాలని ఎల్ఎండీ ఎస్సై కదిరే శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం కేంద్రంతోపాటు పోరండ్లలో ఎన్నికల నియమావళిపై ఎల్ఎండీ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సై శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకా రించాలన్నారు. నిబంధనలు, ఉల్లంఘిస్తే ఎదురయ్యే పరిణామాలను వివరించారు. ఎన్నికల పేరుతో గ్రామా ల్లో వర్గాలు లేదా విభేదాలు సృష్టించడం పూర్తిగా చట్ట విరుద్ధం, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని అన్నారు. ఓటర్లు మద్యం, నగదు, ఉచితాల పంపిణీ లాంటి ప్రలోభాలకు లోనుకావద్దని, ఇటువంటి పంపిణీకి పాల్పడే వారిపై ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చారించారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా ఎన్నికల సందర్భంలో విద్వేష పూరిత పోస్టులు లేదా అభ్యంతరకర కంటెంట్‌ను షేర్ చేస్తే వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నిష్పక్షపాతంగా భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

వైభవంగా సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని తీగలగుట్టపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది. పాఠశాలలో తెలుగు పండిట్ గ్రేడ్-1 ఉపాధ్యాయిని సందుగుల శ్రీదేవి దంపతులు సొంత ఖర్చుతో విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కరుణ, కొలగాని శ్రీనివాస్, జ్యోత్స్న పాల్గొన్నారు.

● గ్రంథాలయ పుస్తక ప్రదర్శన

తీగలగుట్టపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి

గన్నేరువరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థి సందవేని ప్రశాంత్ యాదవ్ గురువారం సాయంత్రం బీజేపీలో చేరారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నేరువరం మండల అభివృద్ధికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కట్టుబడి ఉన్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్, నాయకులు సొల్లు అజయ్‌వర్మ, విలాసాగరం రామచంద్రం, ఏలేటి చంద్రారెడ్డి, కుర్ర హరీష్, పుల్లెల రాము, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కురుమలను గెలిపించాలి

గణేశ్‌నగర్,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో కురుమలను గెలిపించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి అయి లన్న కురుమ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని జిల్లా సంఘం కార్యాలయములో విలేకరులతో మాట్లాడారు. కురుమలను ప్రజా ప్రతినిధులుగా గెలిపిస్తే గామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి మేకల నర్సయ్య కురుమ, జిల్లా సలహాదారులు చెట్కూరి రాములు కురుమ, నాయకులు పాల్గొన్నారు.

రసవత్తరంగా 'పంచాయతీ' పోరు

(5వ పేజీ తరువాయి)

ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆయా కుల సంఘాల పెద్దలను కలుసుకొని ఆశీర్వదించి మద్దతు ఇవ్వాలని, తమను గెలిపిస్తే గ్రామాభివృద్ధికి పాటుపడతామంటూ హామీలు ఇస్తున్నారు. ఓటర్లను ప్రభావితం చేసే నాయకులకు మందు, విందులు కూడా ఏర్పాటు చేసి వారి మద్దతు కూడగడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండే ఓటర్లను ఫోన్లలో సంప్రదించి పోటీలో ఉన్నానని, తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. దీంతో మొదటి విడత ఎన్నికలు జరిగే 91 గ్రామాల్లో రాజకీయం రోజురోజుకు రసవత్తరంగా మారింది. రెండో విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో ఆదివారం ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే అభ్యర్థుల తుది జాబితాతోపాటు పోటీలో ఉన్న సర్పంచ్, వార్డుసభ్యులకు గుర్తులను కేటాయిస్తారు. దీనితో ఆయా గ్రామాల్లో నామినేషన్లు వేసిన అభ్యర్థులు ఉపసంహరణ కోసం బుజ్జగింపు, నజరానాలను ప్రకటిస్తూనే మరోవైపు ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓవైపు చలి తీవ్రత పెరుగుతుంటే పంచాయతీ పోరుతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కుతోంది.

దంత వైద్యశిబిరాలు నిర్వహించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు, విద్యార్థుల కోసం ప్రత్యేక ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ పమేలాసత్పతి ప్రభుత్వ దంత వైద్యుల బృందాన్ని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి దంత వైద్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమస్యలు ఎక్కువగా ఉన్నవారికి జిల్లా జనరల్ ఆసుపత్రిలో చికిత్స అందించాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ దంత వైద్య అధికారులు రవి ప్రవీణ్‌రెడ్డి, రణదీప్, ప్రవీణ్‌రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నం అనిల్‌గౌడ్‌కు సుడా ఛైర్మన్ పరామర్శ

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్ సోదరుడు పొన్నం శ్రీకాంత్‌గౌడ్ మరణించగా ఆయన కుటుంబాన్ని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ తండ్రి ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. చంద్రశేఖర్‌ను కాంగ్రెస్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం తదితరులు ఉన్నారు.

భగవద్గీత పోటీల్లో విజేతలుగా 'మానేరు' విద్యార్థులు

కరీంనగర్ టౌన్, డిసెం బరు 5 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా ప్రజ్ఞ, వికాస తరంగిణి ఆధ్వ ర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి భగవద్గీత పోటీల్లో మానేరు విద్యార్థులు సుస్వ ర మౌక్తిక, అక్షిత ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ జి.సరితారెడ్డి అభినందించారు.

పచ్చునూర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

మానకొండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పచ్చునూర్‌లో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సం నిర్వహించారు. పచ్చునూర్‌లోని వికాస దివ్యాంగుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడారు. దివ్యాంగులు ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కరుణాకర్, ఏపీఎంలు బార్గవ్, రాజేందర్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు చాడ వెంకట్‌రెడ్డి పరామర్శ

భగత్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏఐఎఫ్‌బీ నాయకుడు బండ సురేందర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ తమ్ముడు శ్రీకాంత్‌గౌడ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి గురువారం పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, పైడిపల్లి రాజు, బూడిద సదాశివ, అల్గునూరు మాజీ సర్పంచ్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకటేశ్వర్లుకు సన్మానం

సుభాష్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ మెడికల్ అండ్ హెల్త్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లును ఫిజీషియన్లు సన్మానించారు. గురువారం నగరంలోని శ్వేత హోటల్‌లో జిల్లా ఫిజీషియన్ల సంఘం సమావేశాన్ని నిర్వహించి, జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం డాక్టర్ వెంకటేశ్వర్లును సన్మా నించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నూతన అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ కల్బంది, కార్యదర్శి డాక్టర్ చైతన్యరెడ్డి, కోశాధికారి డాక్టర్ అనీష్‌రెడ్డి, సీనియర్ వైద్యులు లక్ష్మీనారాయణ, రఘురామన్, డీసీ తిరుపతిరావు, విజయ్ మోహన్‌రెడ్డి, సురేష్, వెంకట్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్క్‌సైట్ స్కూల్ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు

గంగాధర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం గట్టుబూత్కూర్‌లో వర్క్ సైట్ స్కూల్ పిల్లలకు శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజ్‌గోపాల్ చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గట్టుబూత్కూర్‌లోని వర్క్ సైట్ స్కూల్ పిల్లలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించామన్నారు. ముగ్గురు చిన్నారులకు మెరుగైన వైద్యం కోసం హయ్యర్ సెంటర్‌కు సిఫారసు చేసినట్లు తెలిపారు. వైద్యాధికారులు శ్వేత, శిరీష, ఎంఎల్‌హెచ్‌పీ రాజలత పాల్గొన్నారు.

రేకుర్తి భూముల కబ్జాపై సమగ్ర విచారణ చేపట్టాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తి భూముల కబ్జాపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ కోరారు. శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రేకుర్తిలోని సర్వే నంబరు 55లోని భూములు కబ్జాకు అనుకూలంగా ఉండడంతో గతంలో ప్రభుత్వ అండ చూసుకొని కొందరు నాయకులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టగా స్థానికుల ఆందోళనలతో అధికారులు వాటిని కూల్చివేశారన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టాల్సిన అధికారులు ఆక్రమణలవైపు కన్నెత్తి చూడడం లేదని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు.

నేడు మహాశక్తి ఆలయంలో అయ్యప్పస్వామి పడిపూజ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 5 : నగరంలోని చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు కావేటి పరమేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. భక్తులు, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొని తరించాలని కోరారు.

సరస్వతీ మాత దత్త పౌర్ణమి హోమం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 5 : స్థానిక సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శుక్రవారం సరస్వతీ మాత దత్త పౌర్ణమి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోల అన్నారెడ్డి, మాదాసు నరసయ్య-లక్ష్మి, ప్రణయ్-నాగరాణి, ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి, డాక్టర్ రమణాచారి, సత్యనారాయణ, దేవేందర్‌రావు, శ్రీనివాస్, శ్యాం, సత్యవిద్యాసాగర్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

అరవిందుల మహా సమాధి దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 5 : స్థానిక సాయినగర్‌లో అరబిందో సొసైటీ కరీంనగర్ సెంటర్ అధ్యక్షుడు కోల అన్నారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అరవిందుల 75వ మహా సమాధి దినోత్సవాన్ని నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి ఉప్పల రామేశం, కోశాధికారి సబ్బని లక్ష్మీనారాయణ అరవిందుల జీవిత చరిత్ర, దేశభక్తి, యోగతత్వం, ఆశ్రమ విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చిందం రమేశ్, సబ్బని శారద, వంశి తదితరులు పాల్గొన్నారు.

సాయి ఈశ్వర్‌చారిది ప్రభుత్వ హత్యే



రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ తీరుకు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వర్‌చారిది ప్రభుత్వ హత్యేనని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి అన్నారు. బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తెలం గాణ చౌక్‌లో గురువారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ బీసీలకు 42 రిజర్వేషన్ అమలు చేయకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి ప్రభుత్వం ముందుకు రావడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని, రిజర్వేషన్ అమలు కాకపోవడంతో మనస్తాపం చెందిన సాయి ఈశ్వర్ చారి పెట్రోల్ పోసుకొని నిప్పటించుకున్నాడని, ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా శుక్రవారం తుదిశ్వాస విడిచాడని తెలిపారు. ఈ ఘటన రాష్ట్ర బీసీ సమాజాన్ని మనోవేదనకు గురిచేసిందన్నారు. సాయి ఈశ్వర్ చారి మరణానికి దారితీసిన పరిస్థితులపై స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసిపెద్ది శ్రీధర్ రాజు, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, మియాపురం రవీంద్ర చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని లక్ష్మి, గెరిగె కోటేశ్వర్, అజయ్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: జిల్లా బీసీ జేఏసీ నాయకులు తెలంగాణ చౌక్‌లో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. సాయి ఈశ్వరాచారి కుటుంబానికి 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆ ఇంటిలో ఒక ఉద్యోగం ఇవ్వాలన్నారు. కేసిపెద్ది శ్రీధర్ రాజ్, బొల్లం లింగమూర్తి, నాగుల కనుకయ్య గౌడ్ రాజకుమార్, బోయిని ప్రశాంత్,దేవరకొండ సంతోషిని,బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం ప్రజాస్వామ్య బీసీ ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో సాయిఈశ్వరచారికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ సాధన కోసం సాయిఈశ్వరాచారి మరణం బాధాకరమన్నారు. బీసీ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కామారెడ్డిలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పడంతోనే సాయి ఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం హత్యేనని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయి ఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. సాయి ఈశ్వరాచారి బలిదానంతోనైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోవాలని తెలిపారు. ఈశ్వరాచారి బలిదానం వృథాగా పోదని, బీసీలు ఐక్యంగా ఆశయసాధన కోసం ఉద్యమిస్తారని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న బీసీ మంత్రులు తక్షణమే రాజీనామా చేసి బయటకు రావాలని డిమాండ్ చేశారు. సాయి ఈశ్వరాచారి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

శంకరపట్నం: బీసీ హక్కుల కోసం ప్రభుత్వం హామీ ఇచ్చిన 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆత్మహత్య చేసుకున్న సాయిచారి మృతికి బీసీ అజాది ఫెడరేషన్ సంతాపం ప్రకటించింది. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సాయిచారి మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీసీ అజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ సాయిచారి మరణం వృథా కాకుండా బీసీల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తామన్నారు. మండలాధ్యక్షుడు అభిలాష్, రాష్ట్ర నాయకులు తిరుపతి, సదానందం, శ్రీనివాస్, అజ్మదూ, ప్రణదీప్, కిరణ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నంలో నివాళులర్పిస్తున్న నాయకులు